
పార్వతి మంచం మీద వెల్లికితలా పడుకొ్కని ఆలోచిస్తోంది.

జానకి ఎంత అదృష్టవంతురాలు ! — భర్త ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టరు ! — మంచి [illegible], చెప్పలేనంత రాబడి గల ఉద్యోగం ! — జానకి దగ్గర ఎప్పుడూ ఎంత డబ్బుంటుందో !. ఇంక చీరలు చెప్పనే అక్కర్లేదు ! — వంద రూపాయిలు దాటిన ఖరీదు గలవే నలభయ్యో, ఏభయ్యో ఉన్నాయి.

# చిన్నగీత పెద్దగీత

## కృపశ్రీ




అవి చాలక ప్రతినెలా ఒక్కొక్క చీర కొనుక్కుంటూనే వుంటుంది. ఒంటి మీద పాతిక ముప్ఫయ్ తులాల బంగారం వుంది బ్యాంక్‌లో ఎంతో డబ్బుంది ఇల్లంతా సోఫాలు, బీర్వాలు, పందిరమంచాలు మొదలైన హంగులతో ఎంతో అందంగా వుంటుంది. ఇంక ప్రతిరోజూ మిఠాయి, పాలు, పెరుగు, నెయ్యి, పళ్లు ఎవరో ఒకరు ఇంటికి పంపిస్తూనే వుంటారు. అంచేతనే అదీ పిల్లలూ ఎప్పుడూ మస్తుగా తింటూ ఆరోగ్యంగా ఆనందంగా, హోదాగా అగుపిస్తారు.

తన సంసారమూ వుంది ! — ఎందుకు ? ప్రతినెలా చివరి వారంలో డబ్బుకి ఇబ్బందే! — తన దగ్గరెప్పుడూ అయిదు రూపాయిల డబ్బులేనా వుండవు ! — చెప్పకో తగ్గవి, మంచివి పట్టు మని పదిహేను చీరలైనా లేవు తనకి ! — ఇంట్లో పిండి వంటలు చేసుకున్నా, మిఠాయి, పళ్లు వంటివి తెచ్చినా ఆ రోజు పండుగే అన్నమాట ! — ఇలావుంది తన సంసారం !

ఇంతా చేసి జానకి పెళ్లికి కూడా వాళ్ల వాళ్లు వెయ్యి రూపాయిలే కట్నం ఇచ్చారు అప్పడు తను గుమస్తా ! ఇప్పుడు మహారాజు లాగ ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టరయిపోయాడు తన భర్త 'ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటనే వున్నాను' అన్నట్టు గుమస్తాగానే వుండిపోయాడు అంచేతనే ఇలావుంది తన సంసారం !

జానకి సంసారం గురించి ఆలోచించిన కొద్దీ పార్వతికి తన సంసారంలో ఎంతో లోటు అగుపించి, తీవ్రమైన అసంతృప్తి ప్రబలి వేధించ సాగింది. ఆ అసంతృప్తి నిండిన

## చిన్నారి చిలిపిచేష్టలు

ఒకరోజు మా పై కప్పుమీది పొయ్యి పొగ గొట్టంలో పిల్లి దాగి మ్యావ్, మ్యావ్ అని అరుస్తూ ఉంది. దానిని బయటకు తీయడానికి ముప్పతిప్పలు పడుతూ ఉన్నాను. అది బయటకు రాలేదు సరికదా, ఇంకాస్త లోనికి చొచ్చుకున్నది. అంతలో మా బేబి వచ్చి "పొయిలో కామి నిద్దె హోయిందా? (ఇక్కడంతా కన్నడం మాట్లాడుతూ ఉంటారు. అందుకే మా బేబి కన్నడ, తెలుగు కలిపి మాట్లాడుతూ ఉంటుంది.) "నాను లేప్తా



నింద్రే" అంటూ ఒక గ్లాసు నిండా నీళ్లు నింపుకొని, గబగబగా డాబా ఎక్కి, పొగ గొట్టంలోంచి నీళ్లు పోసింది. అంతే పిల్లి తుర్‌మని బయటకు వచ్చింది. అప్పుడు మా బేబి నెత్తుకొని "ఇలా నీళ్లు వేస్తే పిల్లి బయటకొస్తుందని ఎలా తెలుసు" అని అడిగితే, "నాను నిద్దే లేవకపోతే నా చెవిలో నీరు పోస్తావు కదా! అలాగే నాను కామిని లేపినాను." అని అంది. దాని ఆలోచనా శక్తికి, దానిని ముద్దుల్లో నింపేసాను.

(శ్రీమతి ఎం. పి. గౌడ్ (ఆలూరు)

## చిన్నగీత—పెద్దగీత

బాధతో, చీకటి పడినా గదిలో లైటు వేసుకోకుండా, అలాగే మంచం మీద పడుక్కుని వుంది పార్వతి.

అప్పటికి సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. భర్త వెంకట్రావు ఆఫీసు నుంచి వచ్చి చూసి- 'లైటు వేసుకోకుండా చీకట్లో పడుక్కున్నావేమిటి ?' అని అడిగాడు.

"ఏంలేదు !" అంటూ లేచి స్విచ్ వేసి వంటింట్లోకి వెళ్లింది పార్వతి.

వెంకట్రావు ఆఫీసు బట్టలు విప్పి, లుంగీ కట్టుకొని, ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కొనివచ్చి, కుర్చీలో కూర్చొని రేడియో ఆన్‌చేసి ప్రాంతీయ వార్తలు వినసాగాడు.

పార్వతి కప్పుతో కాఫీ తెచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్లిపోయింది.

రోజూ కాఫీ తెచ్చి చేతికందించి, తను తాగుతూంటే కబుర్లు చెబుతూ కూర్చొనేది.

ఈ రోజు భార్య ప్రవర్తన అదోలాగ అనిపించింది వెంకట్రావుకి. కాని ఇంతలో ఫిల్మ్ సంగీతం రావడంతో ఈ విషయం గురించి ఆలోచించక అది వినడంలో నిమగ్నుడయాడు.

అనంతరం రేడియో లో 'బావగారి కబుర్లు' అవుతూండగా 'అన్నం పెట్టమ్మా !'అంటూ పిల్లలు ఇంట్లోకి వచ్చారు.

"ఏం ఇంకా భోజనం చేయలేదూ ?" అని అడిగాడు వెంకట్రావు పిల్లల్ని.

"లేదు నాన్నగారూ !– ఇందాక అన్నం పెట్టమంటే అమ్మ కసిరి పొమ్మంది !" అన్నాడు ఆరేళ్ల రెండవవాడు.

రోజూ ఆరుగంటలవుతూండగానే పిల్లల్ని పిలిచి అన్నాలు పెట్టేసేది భార్య. ఇవాళ ఈ ప్రవర్తనకి కారణం అవగతం కాలేదు వెంకట్రావుకి.

పిల్లలు వంటింట్లోకి వెళ్లి తల్లిని అన్నం పెట్టమని అడుగుతున్నారు. వెంకట్రావు రేడియోలో వార్తలు వింటూ కూర్చున్నాడు.

అరగంట తర్వాత భార్య వచ్చి 'భోజనానికి లేస్తారేమిటి ?' అని అడిగింది.

'వడ్డించు !' అంటూ వెళ్లి కూర్చున్నాడు వెంకట్రావు వంటింట్లో. పార్వతి మాటా మంతీలేకుండా వడ్డిస్తోంది.

"అలా ఉన్నావేం ఇవాళ?" అని అడిగాడు వెంకట్రావు.

"ఎలా వున్నాను ?"అని అడిగిందిపార్వతి.

"ఏమిటో అదోలాగ ఉన్నావు ! రోజూలాగ లేవు"

"రోజూ లాగే ఉన్నాను !"

భార్య అలాగ అన్నా ఆమెలో మార్పు కొట్టొచ్చినట్టు అగుపిస్తోంది వెంకట్రావుకి. అయినా మరేమీ అనకుండా భోంచేసి లేచాడు.

భోంచేసిన అనంతరం ఇంటికి తెచ్చిన ఆఫీసు పని పూర్తిచేసే సరికి తొమ్మిదిన్నర అయింది. పిల్లలంతా పడుకున్నారు. పార్వతి వెల్లికితలా పడుకొని ఇంటికప్పుకేసి చూస్తూ ఆలోచిస్తోంది.

"ఏం ఇంకా నిద్ర రాలేదేమిటి ?" అని అడిగాడు వెంకట్రావు భార్య మీదవాలి చేతుల్లోకి చెంపలు తీసుకుంటూ.

"అబ్బ ! ఉండండి !"అంటూ అదోలాగ మొహం పెట్టి పక్కకి తిరిగింది పార్వతి.

"ఏం, ఏమిటయింది ?" అని అడిగాడు వెంకట్రావు కంగారుగా తొలిగిపోతూ.

"ఏంకాలేదు !"

"మరి ఈ ప్రవర్తనకికారణం ఏమిటి ?" వెళ్లి కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

పదినిముషాలు పోయాక వెల్లికితలా పడుకొని ఇంటికప్పుకేసి చూస్తూ అంది పార్వతి–

"ఒక్కొక్కళ్ల జీవితాలు ఒక్కొక్కలాగ మారుతాయికదా !"

"ఇప్పుడు ఎవరి జీవితాలు ఎలా మారేయని ?"

"జానకిసంగతి చెబుతున్నాను. వాళ్లవాళ్లు కూడా దాని పెళ్లికేమీ ఎక్కువ కట్నం ఇవ్వలేదు. నా పెళ్లికి మావాళ్లిచ్చినట్టే వెయ్యి రూపాయిలిచ్చారు. అప్పుడతను గుమాస్తా ! ఇప్పుడు ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టరై పోయాడు. బోలెడంత డబ్బు, బంగారం, బండెడు చీరెలు, ఇంటినిండా ఎన్నో హంగులు రోజూ పాలూ, పెరుగూ, పళ్ళూ, మిఠాయి మస్తుగా తింటూ రాజభోగం అనుభవిస్తున్నాది !"

"నువ్వు నన్ను కట్టుకొని అన్నిటికీ మొహం వాచి బతుకుతున్నావు !"

"నేనా మాట అన్నానా ?"

"మరి దీని అర్థం ఇంతేకదా ?"

"మొహం వాచిపోయేటంత దరిద్రం అనుభవించకపోయినా, ఏదో అన్నట్టు గడచి పోతోందేకాని, ఉత్సాహం, తృప్తి కలగడం లేదు !"

"ఉత్సాహం, తృప్తి మన మనస్సుని అధీనంలో ఉంచుకోవడంవల్ల కలుగుతాయి!"

"మనకెంత వుంటే అంతే సుఖం, ఆనందం అని మనస్సుని సరిపెట్టుకోవడం ఆత్మవంచనే అవుతుంది !"

భార్య ఇలాగ అనడంతో వెంకట్రావు అవాక్కై అయాడు. ఆమె మాటలు అతడి

స్సుని తీవ్రంగా బాధించసాగాయి.

వెంకట్రావు, పెళ్ళి, సంసారం — ఆచారం కోసం సంప్రదాయం కోసం అన్న వాదాన్ని వ్యతిరేకిస్తాడు. సంసారం, సంతానం—స్వర్గం కోసం, నరకాన్ని తప్పించడం కోసం, పుణ్యం కోసం, పాపనివృత్తి కోసం అని చెప్పే ప్రాచీన ధర్మ సూత్రాన్ని ఏ మాత్రం సమ్మడు —పెళ్ళి, సంసారం అన్నవి భార్యాభర్తలు, వారికి కలిగిన సంతానం ఒకరివల్ల ఒకరు సుఖం, ఆనందం పొందడానికి మాత్రమే అని విశ్వసిస్తాడు.

ఇప్పుడు భార్య, సంసారంలో తను పొందుతున్న సుఖం, ఆనందం విషయంలో అసంతృప్తి వ్యక్తపరచడంతో ఉండేలు దెబ్బతిన్న పక్షిలాగే విలవిల లాడిపోయాడు వెంకట్రావు. ఆమె అలాగ అనగానే— 'ఆమెకేమైనా తక్కువ చేశానా ?' అంటూ ఆత్మ పరిశీలన చేసుకో సాగాడు గతాన్ని నెమరువేసుకుంటూ.

తను చాలా జాగ్రత్తగానే సంసారం చేస్తూ, శక్తివంచన లేకుండా భార్యాబిడ్డలకి సుఖం, ఆనందం, తృప్తి కలుగచేయాలన్న తాపత్రయంతోనే ప్రతి విషయంలోను వ్యవహరిస్తున్నాడు.

ఇరవై యేళ్ళక్రితం చిన్న సూట్‌కేసు, జంఖానా పడకచుట్టతో వచ్చిన తను — మరో రెండేళ్ళనాడే పెళ్ళయి, ఇటు తల్లిదండ్రుల ఆస్కారంకాని, అటు అత్తవారి ఆస్కారం కాని లేకుండా సంసారం ప్రారంభించిన తను ఈనాడు ఇంటికి చెప్పుకో తగిన హంగుల్నే కూర్చాడు. ఎప్పుడు డి. యే. ఎరియర్స్ వచ్చినా, ఓవర్‌టైమ్ డబ్బు వచ్చినా, మరే పై డబ్బు వచ్చినా వృధాగా ఖర్చుపెట్టకుండా ఉపయోగంగాను, హంగుగాను, శాశ్వతంగాను ఉండే వస్తువుల్నే కొంటూ రేడియో, సోఫా సెట్టు, గాడ్రెజ్ బీరువా, గ్యాస్ స్టవ్, కుక్కరు, కుట్టుమిషను, పందిరి మంచం వంటివి సంసారానికి ఏర్పరిచాడు. ఒకసారి — భార్య మోజు పడుతోందని అయిదు వందల రూపాయిలు 'లోను' తీసుకొని బంగారం గాజులు చేయించాడు. పెళ్ళికి తన తల్లిదండ్రులు పెట్టిన రాళ్ళ నెక్లెస్ ఇప్పటికీ వుంది. ఇంక నెలకొక వందరూపాయిల చీర కొనకపోయినా పండుగలకీ, పబ్బాలకి ఆమె మోజుపడ్డ చీరలు కొంటూనే వున్నాడు. స్టీలు సామానుకూడా ఇంట్లో తక్కువేం లేదు. రోజూ పంచభక్ష్య పరమాన్నాలు చేసుకోకపోయినా మామూలు టిఫిన్లు చేసుకోని రోజంటూ లేదు. ఉన్న నలుగురు పిల్లల్నీ — ఆరోగ్యంగాను, ఆనందముగాను ఉండేటట్లు జాగ్రత్తగానే చూస్తున్నాడు. పెద్ద బ్యాంక్ అక్కౌంట్లు లేకపోయినా ఏదో కొంత 'సేవింగ్' కూడా వుంది. పోనీ తన ఉద్యోగం హీనమైన ఉద్యోగమా అంటే అదీ కాదు. సీనియర్ గ్రేడుకి చెందిన కేంద్ర ప్రభుత్వపు మూడవతరగతి ఉద్యోగం. రెండు పెద్దగదులు, స్టోరు రూం, వంటగది, ముందూ వెనకా ఇనప కటకటాలతో వరండా, కొళాయితో బాత్‌రూం, సెప్టిక్ లెట్రిన్, ఎలక్ట్రిక్ దీపాలు, ఫాన్, ఇల్లంతా నున్నని సిమ్మెంటు గచ్చు—గల డిపార్టుమెంటు క్వార్టరులో నివాసం! ఇంటద్దె, కరెంటు ఛార్జీతో సహా కోతలన్నీ పోగా జీతం నెలకి నాలుగు వందల రూపాయిలందుతూ ఏ ఇబ్బందులూ లేకుండా సాగిపోతోంది జీవితం

## అ-సామాన్యుడు

—కె. ప్రకాశరావు

ఆంజనేయుడు
సంజీవ నగాన్ని మోశాడు !
దశకంఠుడు కాలకంఠుడి
కైలాసాన్ని మోశాడు !
హరి కూర్మ రూపియై
మేరు పర్వతాన్ని మోశాడు !
నేటి సామాన్యుడు
వీరందరికన్నా ఎంతో ఘనుడు !
బ్రతికినంతకాలం అధిక ధరల
భారాన్ని మోస్తాడు ! !

అయినా ఈ సంసారం గురించి అసంతృప్తి వ్యక్తపరుస్తోందేం తనభార్య ?

చిన్ననాటి స్నేహితురాలయిన జానకి జీవితంతో తనజీవితాన్ని పోల్చిచూసుకొని ఇలాబాధపడుతోంది ఆమె ! దానికి తనేం చేయగలడు?

జానకి భర్త నారాయణరావుకి ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టరుగా ఈ ఊరు బదిలీ అయింది. నెలరోజుల క్రిందటే ఇల్లు అద్దెకు కుదుర్చుకొని కుటుంబాన్ని తీసుకు వచ్చేశాడు. అప్పటినుంచి అతని భార్యకి తన భార్యకి ఆ చిన్ననాటి స్నేహం మళ్ళీ చిగురు తొడగడం ప్రారంభించింది:

మొదట అందరిలాగా మామూలుగానే ప్రారంభం అయినా అవకాశం, అదృష్టం కలిసివచ్చి కొందరి జీవితాలు ఊహించనంత ఉన్నతస్థాయి నందుకుంటాయి. ఇప్పుడు నారాయణరావు విషయంకూడా అంతేఅయింది. అతనుకూడా స్కూలు ఫైనలే పాసై మొదట గుమస్తా ఉద్యోగంలోనే చేరాడు. అయితేనేం ? — నెత్తిమీద సంసార బాధ్యతలంతగా లేకపోవడం వల్లను, కుటుంబంలోని వారి ప్రోత్సాహం, సహకారం లభించడం వల్లను ఆ ఉద్యోగం చేస్తూనే నైట్‌కాలేజీలో చదివి బి. కాం. పాసైయాడు. ఆ తర్వాత కొన్ని డిపార్టుమెంటు పరీక్షలు పాసయాడు. దానితో ఇన్‌కమ్‌టాక్సు ఇన్‌స్పెక్టరు ఉద్యోగం లభ్యమయింది అతనికి. ఊరంతా హోదా, పలుకుబడి, రాబడికలిగి మూడు పువ్వులూ ఆరుకాయలుగా సాగుతోంది అతని జీవితం.

స్కూల్ ఫైనల్ పాసై, ఉద్యోగం అయీ అవడంతోనే నెత్తికెక్కిన సంసార బాధ్యతలు, బాధలతో — మనస్సులో కోరికలు ఉన్నా పై చదువులు చదవలేకపోయాడు తను. తత్ఫలితంగా తాబేటి నడకతో సాగిన తన ఉద్యోగ జీవితం ఇరవై ఏళ్ళ సర్వీసు అనంతరం, ఈనాటికి సీనియర్ గ్రేడు గుమస్తా స్థాయికి చేరింది.

ఇందుకు తను నేరస్థుడా ?

వెంకట్రావు తన మనస్సుని ప్రశ్నించుకున్నాడు. దీనితో అతడు భార్యా బిడ్డలతో సరదాగా గడపలేని స్థితికొచ్చాడు. ఇంట్లో ఎవ్వరితోనూ మాటాడకుండా ముభావంగా ఉండసాగాడు.

తండ్రి ప్రవర్తనచూసి పిల్లలు కంగారు పడసాగారు. భర్త ముభావంగా వుండడం చూసి, అందుకు కారణం ఎరిగుండీకూడా, తన తప్పును అంగీకరించకపోగా, —"ఎందుకలా మొహం ముటముట లాడించుకుంటారు ? నేనేం లేని మాటా కాని మాటా అన్నాను కనుకనా ?" అంటూ సాధించింది పార్వతి మూడవరోజున.

"లేని మాటా కాని మాటా అన్నావని ఎవరన్నారు ?" అన్నాడు వెంకట్రావు.

"మరి ఉన్న మాట అంటే కోపం ఎందుకు ?"

"ఎందుకు బ్రతికున్నానా అని !"

"చూడండి, నాకలాగ లేనిది ఉందని చెప్పడం చేతకాదు ! — ఆ జానకిదగ్గర చూడండి ఎప్పుడూ బోలెడంత డబ్బు



CU A 1313

## చిన్నగీత—పెద్దగీత

వుంటుంది. తనకి, మొగుడికి, పిల్లలకి రకరకాల మంచి మంచి బట్టలు, తన ఒంటినిండా బంగారం, బ్యాంక్ ఎకౌంట్, రోజూ ఎవరో ఒకరు పాలో, పెరుగో, పళ్ళో, మిఠాయో పంపిస్తూ వుంటారు. మస్తుగా తింటూ రాజభోగం అనుభవిస్తున్నాది. నాకలాగ జరుగుతున్నదా ?— అంచేత సుఖం, ఆనందం గల జీవితం అంటే దానిదే అన్నాను !"

"నిజమే !"

భార్య రెండోసారి కూడా అదేరకమైన ధోరణిని వ్యక్తపరచడంతో వెంకట్రావు ఆవేదన మరింత అధికమయింది. దానితో అతడు మరీ తప్పు చేసిన వాడిలాగ బాధ పడుతూ భార్యాపిల్లలని తప్పించుకు తిరగ సాగాడు.

మరో నాలుగు రోజులు గడిచాయి.

ఆవేళ సాయంత్రం వెంకట్రావు ఆఫీసు నుంచి ఇంటి కొచ్చేసరికి ఇంట్లో పాతిక ముప్పయ్ సంవత్సరాల మధ్య వయసుగల అమ్మాయి అతడికి అగుపించింది. సామాన్యమైన నూలు చీర కట్టుకొని అతి సామాన్యంగా వుంది ఆమె. తన పిల్లలతో ఎవరో కొత్త పిల్లలు ఇంట్లో ఆడుకుంటూ కన్పించారు.

"మా మావయ్య కూతురూ పిల్లలూ వచ్చారు. భీముని పట్నంలో పెళ్ళికి వెళుతూ ఇక్కడ దిగింది !" అని చెప్పింది భార్య కాఫీ తీసుకొచ్చియిస్తూ.

"ఎక్కడ వుంటున్నారు ?"

"బెజవాడలో. వాళ్ళాయన అక్కడ స్కూల్ మాస్టరు !"

ఆ అమ్మాయి తన భార్య దగ్గర చాలా చనువు ఉన్నట్టు ఇంట్లో స్వతంత్రంగా తిరగడం, ఆమె, తన భార్య వంటింట్లో కూర్చొని నిర్విరామంగా ఎన్నో కబుర్లు చెప్పుకోవడం గమనించాడు వెంకట్రావు. భార్య ముఖంలో వారం రోజులైౖ లేని ఆనందం కూడా అగుపించింది అతడికి. ఆమె ఏమీ జరగనట్టుగా మామూలుగా వుంటూ తనతో సరదాగా మాటాడడానికి ప్రయత్నించడం కూడా గుర్తించాడు వెంకట్రావు. పిల్లలు కూడా సరదాగా ఆడుకుంటూ కన్పించారు. ఆ అమ్మాయి కూడా అతడితో మాటామాటా కలపసాగింది. దీనితో వెంక

ట్రావు కొంత బాధను తాత్కాలికంగా మరచాడు.

మూడోరోజు సాయంకాలం వెంకట్రావు ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి ఆ అమ్మాయి, పిల్లలు కన్పించలేదు.

"మీ మావయ్య కూతురు వెళ్లిపోయిం దేమిటి ?" అని అడిగాడు భార్యని.

"వెళ్లిపోయింది !...మొదట కాఫీ, టిఫిను తీసుకొచ్చి అన్నీ చెబుతానుండండి !" అంటూ వెళ్లింది భార్య. పదిరోజులై లేని ఉత్సాహం, ఆనందంతో భార్య అగుపించడం చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు. బట్టలు మార్చుకొని, ముఖం, కాళ్లూ, చేతులు కడుక్కొనివచ్చి కూర్చున్నాడు.

యింతలో భార్య ప్లేటులో బజ్జీలు, గ్లాసుతో నీళ్లు, ఫ్లాస్కుతో కాఫీ తెచ్చి టీపాయ్‌మీద పెట్టి ఎదురుగా వున్న సోఫాలో కూర్చొని చెప్పడం ప్రారంభించింది.

"దానికీ నాకూ చిన్నప్పటి నుంచీ ప్రాణ స్నేహం. మా యిద్దరిమధ్యా ఎప్పుడూ ఏ రహస్యాలూ వుండేవి కావు. అరమరికలు అంత కంటే లేవు. ఎంత చెప్పకూడని రహస్యాలైనా ఒకళ్లకొకళ్లం చెప్పుకొనేవాళ్లం. మన పెళ్లి కొచ్చింది కూడాను. మన పెళ్లయిన మూడేళ్లకే దాని పెళ్లయింది. మూడువేలుకట్నంతో సెకండరి గ్రేడు మేస్టరుకిచ్చి పెళ్లి చేసేరు. ఇప్పుడు బెజవాడలో వుంటున్నారు. వాళ్లాయన పినతల్లికూతురి పెళ్లికని భీమునిపట్నం వెళు తున్నాది. మన పెళ్లిలో కలుసుకున్న తరువాత మేమిద్దరం మళ్లీ ఇదే కలుసుకోవడం ! తన సంసారపు సంగతులన్నీ చెప్పింది.

వాళ్లాయనకి ప్రావిడెంటు ఫండు కోతపోగా నెలకి రెండు వందల ముప్ఫయ్ రూపాయలు జీతం అందుతుందట. ప్రైవేట్లవల్ల నెలకి డెబ్బయ్ రూపాయిలొస్తాయిట ! అందులో ఇంటద్దె నెలకి ముప్ఫయ్ రూపాయి లిస్తున్నా రట. ఇల్లు చాలా చిన్నదట. ముందో చిన్న జాఫిరి, తర్వాత ఒక చిన్నగది, ఆ తర్వాత పంచపాళీ—అందులోనేవంటా భోజనాలూనట. దొడ్డి ఎనిమిదిళ్ల వాళ్లకీ ఒక్కటే నట. పెరట్లో బయటనే స్నానం చేసుకోవాలట. స్నానానికి బాత్‌రూం కాని, ప్రత్యేకస్థలం కాని లేవుట. వీళ్లింటికి వందగజాల దూరంలో వీధిలో పబ్లిక్ కుళాయి ఒకటుందట. దానివే కాని ఇంట్లో నీటి సౌకర్యంలేదట. ఆ కొళాయి దగ్గరకూడా ఊరంతరద్దీట ! గంట సేపు నిల్చుంటే బిందెడు నీళ్లు దొరకడం కష్టంట. అంచేత నీళ్లు పాచిపనికి, నీళ్లు పోయడానికి నెలకి పదిహేను రూపాయిలిచ్చి మనిషిని పెట్టుకున్నారుట. నెలకి అయిదురూపాయిలు కరెంటు ఛార్జీ అవుతుందట. ఇవన్నీ పోగా మిగిలిన రెండు వందలేభై రూపాయిలతో ముగ్గురు పిల్లలూ మొగుడూ పెళ్లాం కాలక్షేపం చేయటం చాలాకష్టంగా వుందట. పాపం, ఒక్కటికూడా మంచి చీర లేదంట ! మన యిల్లు, మనసంసారం చూసి ఎంతపొంగి పోతున్నాదో—'నువ్వెంత అదృష్టవంతురాలివే' అంటూ. పెళ్లికి మంచి చీరలేనా లేకుండా వెళితే అందరిలోనూ చిన్నతనంగావుంటుందని వెళ్లనందిట. వాళ్లాయనకి పరీక్షల టైము. ఆయన వెళ్లడానికి వీలులేదట. దగ్గరవాళ్లు—ఎవరూ వెళ్లకపోతే బాగుండదని, దీనిని వెళితే కాని వీలులేదని బలవంత పెట్టేడట ! ఎలా వెళ్లడమే అంటూ యేడ్చింది. నా దోరుబియాన్ చీర, ఒక పట్టుచీర, రెండు టెరికాట్ చీరలు, నెక్లెసు ఇచ్చి పెళ్లిలో వాడుకొమ్మని చెప్పేను !

వెంకట్రావు భార్య చెప్పినదంతావిన్నాడు— "పోనీ, దరిద్రంలో మనకి తీసిపోకుండా వున్నా రన్నమాట !" అన్నాడు టేబిల్ మీదున్న వార పత్రిక తీసి తలదూరుస్తూ.

భర్త అలాగ అనడంతో అప్పటికి మరేమీ అనకుండా వంటింటిపని చూడడానికి వెళ్లి పోయింది పార్వతి.

మరో గంటన్నర తరువాత భర్తని భోజనా నికి పిలిచింది పార్వతి. భర్త ప్రక్కనే తనూ భోజనం చేస్తూ ఎన్నో కబుర్లు చెప్పసాగింది. అన్నీ వింటూ 'ఊఁ' అనడమే తప్ప ఎక్కువగా మాటాడలేదు వెంకట్రావు భార్యతో.

భోజనాలయాక రాత్రి తొమ్మిదిన్నరకి వంటింటి పనంతా ముగించి గదిలో కొచ్చింది పార్వతి. పిల్లలంతా నిద్రపోతున్నారు. భర్త కూర్చొని పేపరు చదువుతున్నాడు. పార్వతి భర్తవద్దకు వచ్చి చేతుల్లోవున్న పేపరుని లాక్కొని టేబిలుమీద పడేస్తూ—"ఇంకా కోపమేనా ?"అని అడిగింది.

"పెళ్లాం, పిల్లలకి సుఖం ఆనందం ఇవ్వలేనివాడికి కోపం ఏమిటి ?" అన్నాడు వెంకట్రావు.

"మీరుండగా నాకూ పిల్లలకీ సుఖానికీ ఆనందానికీ ఎప్పుడూ లోటురాదు !"అంది పార్వతి.

"నెలకి నాలుగొందలరాళ్లు తెచ్చుకొనే గుమాస్తా వల్లలోటుకాక మరేమిటి ?"

"ఇంక చాలించి లేవండి, పదవుతూంది, పడుక్కుందాం !" భర్తని మరేమీ అన నీయకుండా రెక్కపట్టుకుని లాగింది పార్వతి.

"పూర్వం ఒక రాజుగారు గోడమీద ఒక చిన్నగీత గీసి దానిని ముట్టుకోకుండా పెద్ద గీత చెయ్యమని కొలువులోవారిని అడిగారట. వెంటనే మంత్రి లేచి ఆగీత ప్రక్కనే అంత కంటే చాలా చిన్నగీత గీశాడట. దానితో రాజుగారు గీసిన చిన్నగీత పెద్దగీత అయిపోయి ఊరుకుందట." భార్యపక్కన పడుక్కుంటూ అన్నాడు వెంకట్రావు.

"ఇదుగో, మరా సంగతులేమీ ఎత్తొద్దని చెప్పానా ?—చెప్పినమాట బుద్ధిగా వినాలి !" అంది పార్వతి భర్తని పెనవేసుకుపోతూ.

